తెలంగాణ TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 11 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:254 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


# మధిర భవిష్యత్తే మా లక్ష్యం: భట్టి విక్రమార్క

రాజకీయాల కోసం కాదు..

రాబోయే 50 ఏళ్ల అవసరాల కోసం ఎన్నికలు

'ఆదర్శ పట్టణం'గా మధిరను తీర్చిదిద్దుతాం

**మధిర, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు)**

మధిర మున్సిపాలిటీ ఎన్నికలు కేవలం రాజకీయాల కోసమే కాదని, మధిర భవిష్యత్తును నిర్ణయించే కీలక సందర్భమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో మధిరను ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మధిర మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భట్టి విక్రమార్క ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఓటు హక్కును ఆలోచించి వినియోగించాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో..



# స్థిరమైన నాయకత్వం.. బలమైన ముందడుగు

సంక్షేమ పాలనపై ప్రజల విశ్వాసమే విజయానికి బలం

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థిరమైన పాలన, స్పష్టమైన దిశతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకున్న అభివృద్ధి పాలనకు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని, అదే ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైన ఊపును అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పట్టణాభివృద్ధి చర్యలు ప్రజల నిత్య జీవితాల్లో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడిందని, అది ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయానికి సమన్వయంతో కూడిన నాయకత్వం, బూత్ స్థాయి క్రమశిక్షణ, క్షేత్రస్థాయిలో ఐక్యత అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ శ్రేణులంతా ఒకే లక్ష్యంతో, స్పష్టతతో పనిచేస్తే ఫలితం అనుకూలంగా ఉంటుందని సూచించారు. ప్రజలే కేంద్రంగా, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని, పట్టణ ప్రాంతాల ప్రగతికి ఈ ఎన్నికలు కీలక మలుపు అవుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. సంక్షేమం, ప్రజాపాలన, పారదర్శకతే కాంగ్రెస్ పాలనకు పునాది అని మరోసారి స్పష్టం చేశారు.



# ఫోన్ ట్యాపింగ్ ఇప్పటికీ జరుగుతోంది

ప్రభుత్వ సమాచారం లీక్‌పై అనుమానాలు

కేసీఆర్ వద్ద ట్యాపింగ్ పరికరాలు ఉన్నాయన్న ఆరోపణ

విచారణకు ప్రభుత్వం సీరియస్ – మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇంకా కొనసాగుతోందని, ప్రభుత్వంలో ఉన్న తమ అంతర్గత సమాచారం బయటికి ఎలా వెళ్తుందనే అనుమానం ఎప్పటి నుంచో ఉందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మాట్లాడుకున్న కీలక అంశాలు, కాన్ఫరెన్స్ కాల్స్ కూడా బయటికి లీక్ అవుతున్నాయని పేర్కొన్నారు. మేము మాట్లాడుకుంటున్న కాన్ఫరెన్స్ కాల్స్ ఎవరో వింటున్నారనే అనుమానం ఉందని మంత్రి తెలిపారు.



మిగతా 2లో..

# రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌పై సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ



- బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గం
- 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారు – బాధ్యత ప్రభుత్వానిదే
- బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2లో..



# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: డీజీపీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**


రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర పోలీసు శాఖ డీజీపీ రవి గుప్త తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు

గాజుల రామారం–మెట్ ఖాన్‌గూడాలో కంపించిన భూమి

భయంతో ఇళ్ల నుంచి బయటికి పరుగులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఉదయం సుమారు 10:10 గంటల సమయంలో గాజులరామారం పరిధిలోని మెట్ ఖాన్‌గూడా ప్రాంతంలో భూమి కంపించినట్లు శబ్దం వినిపించిందని చెప్పారు. ఈ ఘటనతో పలు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న ప్రజలు భయంతో ఒక్కసారిగా బయటికి పరుగులు తీశారు.

మిగతా 2లో..

# కృష్ణా జలాల దోపిడీపై ప్రభుత్వ వైఫల్యం: హరీష్ రావు

ఏపీ 80 శాతం నీళ్లు వినియోగం

కేఆర్ఎంబీ లేఖలపై స్పందన కరవు

తెలంగాణ అవసరాలపై నిర్లక్ష్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ అప్పనంగా తీసుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు.

మిగతా 2లో..

# కొండాపూర్‌లో 700 కోట్ల విలువైన భూమి పరిరక్షణ


జంగమోని కుంట ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

చెరువును మాయం చేసిన కబ్జాదారులపై కేసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

కొండాపూర్ ప్రాంతంలో ఉన్న జంగమోని కుంటను కాపాడేందుకు హైడ్రా కీలక ఆపరేషన్ చేపట్టింది. సుమారు రూ.700 కోట్ల విలువైన భూమిని ఆక్రమణల నుంచి రక్షిస్తూ, చెరువును పునరుద్ధరించే దిశగా చర్యలు ప్రారంభించింది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం-మదీనగూడ మార్గంలో ఉన్న జంగమోని కుంటను కబ్జాదారులు పూర్తిగా మాయం చేసినట్లు హైడ్రా గుర్తించింది.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కొండాపూర్‌లో 700 కోట్ల విలువైన భూమి పరిరక్షణ

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 4 ఎకరాల చెరువు స్థలంలో మట్టి పోసి చదును చేసి, ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేసినట్లు తేలింది. ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులు ఇప్పటికే కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. జంగమోని కుంట మాయం అంశంపై ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, హైడ్రా రెవెన్యూ అధికారులతో కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించింది.




క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు, ఇది చెరువు స్థలమేనని నిర్ధారించారు. చెరువును పూర్తిగా కాపాడే లక్ష్యంతో హైడ్రా చర్యలు చేపట్టింది. జంగమోని కుంట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తూ, ఇకపై ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. నగరంలోని జలాశయాలను పరిరక్షించడమే లక్ష్యంగా హైడ్రా తన ఆపరేషన్‌ను కొనసాగిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# కృష్ణా జలాల దోపిడీపై ప్రభుత్వ వైఫల్యం: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను పూర్తి ఆధారాలతోనే ఈ విషయాలు చెబుతున్నానన్నారు.

ఇండెంట్‌లు లేవు, బోర్డు అనుమతులు లేవు అయినా ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను వినియోగిస్తోందని అన్నారు. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు రాసిన లేఖను ప్రస్తావిస్తూ, తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం ఏపీ వాటాను ఇప్పటికే దాటి, జనవరి 29 నాటికి 664 టీఎంసీలు అంటే సుమారు 80 శాతం నీటిని వినియోగించిందని చెప్పారు. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జనవరి 28న బోర్డుకు లేఖ రాసి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి ఏపీ నీటి దోపిడీని ఆపాలని కోరిన ఈఎన్‌సీ, మూడు రోజుల్లోనే రిటైర్ అయ్యారని తెలిపారు. ఆయన రిటైర్మెంట్ తర్వాత వారం రోజుల పాటు కీలక పోస్టును ఖాళీగా ఉంచడం వెనుక ఉద్దేశం ఏమిటని హరీష్ రావు నిలదీశారు. బోర్డు సభ్యుడే ఖాళీగా ఉండగా రాష్ట్ర ప్రయోజనాలు ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ఈ వాటర్ ఇయర్‌లో తెలంగాణకు తాత్కాలికంగా 34 శాతం నీటి వినియోగ హక్కు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే వినియోగించుకున్నామని చెప్పారు. రోజుకు ఇప్పటికీ ఏపీ 1.5 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే ప్రభుత్వం చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు ఉత్తరాలు రాయడం తప్ప మరేమీ చేయడం లేదని విమర్శించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలిపోతున్నా ప్రభుత్వం కళ్లుమూసుకుందని మండిపడ్డారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటలు, పారిశ్రామిక అవసరాలకు నీరు అవసరమని గుర్తుచేశారు. తెలంగాణ అవసరాలను పక్కనపెట్టి రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల వినియోగం అత్యల్ప స్థాయికి పడిపోయిందని, ఇది ముఖ్యమంత్రి వైఫల్యానికి నిదర్శనమని హరీష్‌రావు తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# సిద్దిపేట జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం భగ్నం



- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎఫ్ఎస్ టీమ్ దాడులు
- బీఆర్ఎస్ అభ్యర్థి కోసం నిల్వ చేసిన మద్యం, నిత్యావసర సరుకులు సీజ్

సిద్దిపేట జిల్లా, (తెలంగాణ ముచ్చట్లు):

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం, నిత్యావసర సరుకులను అధికారులు పట్టుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని రెండో వార్డులో పక్కా సమాచారం మేరకు ఎఫ్ఎస్ టీమ్ ఆకస్మిక దాడులు నిర్వహించింది. అధికారుల తనిఖీల్లో, బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ఓటర్లకు పంపిణీ చేసేందుకు మద్యం బాటిళ్లు, నిత్యావసర సరుకులను ముందుగానే నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ సరుకులు సిద్ధం చేసినట్లు అధికారులు నిర్ధారించారు. దాడుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, నిత్యావసర సరుకులను సీజ్ చేసి, సంబంధిత వివరాలను ఎన్నికల అధికారులకు నివేదించారు. ఈ ఘటనపై మరింత విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశంతో ఇలాంటి దాడులు కొనసాగుతాయని, ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరించారు.

# సదాశివపేటలో డబ్బుల పంపిణీ కలకలం



- వృద్ధులు, పేదలకు నగదు పంచిన జగ్గారెడ్డి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

సంగారెడ్డి జిల్లా, (తెలంగాణ ముచ్చట్లు):

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఘటన కలకలం రేపింది. సదాశివపేటలోని చాంద్ భాయ్ హోటల్ సమీపంలో వృద్ధులు, పేదలకు నగదు పంపిణీ చేసినట్లు ఆరోపణలతో జగ్గారెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేశారు. బైక్‌పై తిరుగుతూ ప్రజలకు డబ్బులు పంచుతున్నాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే హోటల్ వద్దకు చేరుకుని జగ్గారెడ్డిని అక్కడి నుంచి పంపించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు పంపిణీ చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై జగ్గారెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# పరకాల పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలించిన వరంగల్ సీపీ

- ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి – అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

పరకాల, (తెలంగాణ ముచ్చట్లు):

రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పరకాల మున్సిపాలిటీకి సంబంధించిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం పరిశీలించారు. పరకాల మండల కేంద్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పోలింగ్ సామగ్రి పంపిణీ జరుగుతున్న విధానాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియపై పోలీస్, రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను అదనపు కలెక్టర్ రవితో కలిసి సీపీ పరిశీలించారు. ముఖ్యంగా ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

లెక్కింపు ప్రక్రియ సజావుగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పరకాల ఏసీపీ సతీష్ బాబుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బ్యాలెట్ బాక్స్‌ల భద్రతకు సంబంధించి స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఉండాలని సూచించారు. రేపు జరగనున్న ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశించారు. ఎవరూ ఎన్నికల నియమావళిని అతిక్రమించకుండా కఠినంగా పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ తనిఖీలో స్థానిక ఆర్డీఓ నారాయణ, ఏసీపీ నాగయ్య, ఇన్‌స్పెక్టర్లు క్రాంతి కుమార్, రంజిత్ కుమార్, ఎస్ఐ అశోక్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పదండి మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

చొప్పదండి (తెలంగాణ ముచ్చట్లు):

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్
- స్వేచ్ఛాయుత, ప్రశాంత పోలింగ్‌కు అధికారులకు ఆదేశాలు
- ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచన

కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీలో జరుగుతున్న రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026 ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా చొప్పదండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు.

పోలింగ్ రోజు ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సిబ్బంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆమె గుర్తుచేశారు.

ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా, నిబంధనల మేరకు నిర్వహించేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు.

# మధిర భవిష్యత్తే మా లక్ష్యం: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి, మార్పు కోరుకునే ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి మధిర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయాలని కోరారు. మన మధిర మన బాధ్యత అని పేర్కొన్న భట్టి విక్రమార్క, పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో తీసుకునే నిర్ణయమే మధిరను ముందుకు నడిపిస్తుందని, ప్రజలు మార్పుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ ఇప్పటికీ జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అవి బయటికి ఎలా లీక్ అవుతున్నాయో అర్థం కావడం లేదని, ఇది సాధారణ విషయం కాదని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అంతర్గత చర్చలు కూడా బయటికి రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ మామిడి తోటలో కూర్చొని ఫోన్ ట్యాపింగ్ చేస్తూ తమ ఫోన్లు వింటున్నాడన్న అనుమానం తమకు ఉందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన పరికరాలు ఆయన వద్ద ఉన్నాయని భావిస్తున్నామని తెలిపారు. ఈ అంశాన్ని తమ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కేసీఆర్ వద్ద ఉన్నాయని అనుమానిస్తున్న ఎక్విప్మెంట్‌ను బయటపెట్టే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొనగా, పిల్లలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

భూమి కంపించిన శబ్దం భూకంపం కారణంగానా లేక ఇతర పేలుడు పదార్థాల వల్లనో అన్న విషయంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి.

ఈ ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. భూ ప్రకంపనలపై స్పష్టత రావాల్సి ఉందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: డీజీపీ

(మొదటి పేజీ తరువాయి)

శాంతిభద్రతల పరిరక్షణ కోసం అదనంగా 3 వేల మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించామని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, గస్తీ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, ఎలాంటి భయం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌పై సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)



రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను చెల్లించకుండా వారిని తీవ్ర మానసిక వేదనకు గురి చేయడం సరికాదని లేఖలో తీవ్రంగా తప్పుబట్టారు.

పదవీ విరమణ చేసి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ బెనిఫిట్స్ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత ప్రశాంతంగా జీవించాల్సిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని నేరమని, ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే అన్ని బెనిఫిట్స్ చెల్లించి, సగౌరవంగా సన్మానించి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితాంతం ప్రభుత్వం కోసం పనిచేశారని, చివరి దశలో వారిని ఇలాంటి పరిస్థితులకు నెట్టడం అన్యాయమని అన్నారు.

తక్షణమే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నీ చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేస్తూ, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ప్రకటించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర రవాణా డ్రైవర్లు, కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా దయ్యాల దాసు

**పెద్దమందడి,ఫిబ్రవరి10 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రవాణా డ్రైవర్లు, కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా దయ్యాల దాసును నియమిస్తూ నియామక పత్రాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా దయ్యాల దాసు మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలిపారు.తనకు ఈ బాధ్యత అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.డ్రైవర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సంఘం అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడతానని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు, కార్మికులకు సంఘం బలంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని దయ్యాల దాసును అభినందించారు.



## పుట్టినరోజు సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేసిన బండారు శ్రీనివాస్

**వనపర్తి,ఫిబ్రవరి10(తెలంగాణ ముచ్చట్లు):**

జైభేం సేవా సొసైటీ అధ్యక్షులు బండారు శ్రీనివాస్ తన 53వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. పుట్టినరోజును ఆర్భాటాలు, కేక్ కటింగ్‌లు, పార్టీలతో కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆయనకు ప్రత్యేకతగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పుట్టినరోజుల సందర్భంలో అనవసర ఖర్చులు చేయకుండా, బండారు శ్రీనివాస్ మాదిరిగా సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పుట్టుక, చావు నీది... బ్రతుకంతా సమాజనిధి అనే భావనతో అందరూ సమాజ ఉన్నతి కోసం కృషి చేయాలని అన్నారు.సమాజం కోసం నిరంతరం పనిచేసే వ్యక్తులను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, సేవా భావనతో ముందుకు వచ్చే వారే నిజమైన నాయకులని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కవి జనజ్వాల, భాలస్వామి, స్వామి, సురేందర్ తదితరులు పాల్గొని బండారు శ్రీనివాస్‌ను అభినందించారు.



## వెల్టూర్‌లో వారాంతపు సంత ఏర్పాట్ల పనులపై గ్రామ నాయకుల పరిశీలన

**పెద్దమందడిఫిబ్రవరి(10తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో వారాంతపు సంత ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్ గ్రామ నాయకులతో కలిసి సంత స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామ ప్రజలకు అవసరమైన వాణిజ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో చేపడుతున్న పనుల పురోగతిపై గ్రామ నాయకులతో వారు చర్చించారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. వారాంతపు సంత గ్రామ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు.రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం ఈ సంత ద్వారా లభిస్తుందని తెలిపారు. దీంతో గ్రామంలో ఆర్థిక లావాదేవీలు పెరిగి, ప్రజలకు న్యాయమైన ధరలు లభిస్తాయని పేర్కొన్నారు.సంతకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ సదుపాయం, షెడ్లు, చెత్త నిర్వహణ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ నాయకులకు సూచించారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలకు అనుకూలంగా సౌకర్యాలు కల్పించాలన్నారు.అలాగే గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారాంతపు సంతను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంత నిర్వహణ ద్వారా గ్రామానికి ఆదాయం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా వారాంతపు సంత నిర్వహణ జరిగేలా గ్రామ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఎన్నికల బందోబస్తుపై పోలీసుల బ్రీఫింగ్

- కట్టుదిట్టమైన భద్రత.
- చట్టవ్యతిరేక చర్యలపై కఠిన చర్యలు.

**సత్తుపల్లి, ఫిబ్రవరి10 (తెలంగాణ ముచ్చట్లు):**






ఈ నెల 11వ తేదీన జరగబోయే సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు హాజరైన పోలీసు సిబ్బందికి డ్యూటీలో పాటించాల్సిన విధులు, జాగ్రత్తలపై కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ మరియు సత్తుపల్లి ఎస్‌హెచ్‌వో తుమ్మలపల్లి శ్రీహరి బ్రీఫింగ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ బందోబస్తులో 3 మంది ఏసీపీలు, 3 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, అలాగే సుమారు 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారని వెల్లడించారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు జిల్లాలో 163/బీఎన్ఎస్ఎస్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరినా, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని సత్తుపల్లి పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# వెల్టూర్‌లో ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రం ప్రారంభం

**పెద్దమందడి,ఫిబ్రవరి10(తెలంగాణ ముచ్చట్లు):**







వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినియోగదారుల సేవా కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అశోక్ ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా, అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకు మేనేజర్ మణిదీప్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు వేగంగా అందించడమే ఎస్‌బీఐ ప్రధాన ఉద్దేశమని, ఖాతా ప్రారంభం, నగదు లావాదేవీలు, పింఛన్ల పంపిణీ, ఆధార్-బ్యాంకు లింకింగ్ వంటి సేవలు ఈ కేంద్రం ద్వారా అందుబాటులో ఉంటాయని వివరించారు.గ్రామస్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామంలో ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు కావడం గ్రామాభివృద్ధిలో మరో కీలక అడుగుగా అభివర్ణించారు.గ్రామ ప్రజలు బ్యాంకింగ్ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని సేవలు పొందే అవకాశం లభించిందన్నారు. ముఖ్యంగా రైతులు, వృద్ధులు, మహిళలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రైతు భరోసా, పింఛన్లు, ఇతర సంక్షేమ నిధులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న నేపథ్యంలో గ్రామంలో సేవా కేంద్రం ఉండటం ప్రజలకు మేలు చేస్తుందన్నారు.గ్రామస్తులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకుని, డిజిటల్ లావాదేవీల వైపు అడుగులు వేయాలని సూచించారు.అలాగే సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఆంజనేయులు పూర్తి పారదర్శకతతో లావాదేవీలు నిర్వహిస్తూ.. ప్రజలకు నమ్మకమైన సేవలు అందించాలని రఘుపతి రెడ్డి, బ్యాంక్ మేనేజర్ మణిదీప్ సూచించారు. ఈ సేవా కేంద్రం ద్వారా గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, మహిళా సమైక్య సిబ్బంది, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

**బీటెక్ మూడో సంవత్సరం ఫలితాల్లో అగ్రస్థానం.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**




జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్ తాజాగా ప్రకటించిన బీటెక్ మూడో సంవత్సరం తుది పరీక్షా ఫలితాల్లో బి గంగారం సాయిస్ఫూర్తి స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో విద్యార్థినీ-విద్యార్థులు అధిక మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరోసారి చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు.

**ఈఈఈ:** విభాగంలో తాటి విశాల్ హర్ష వర్ధన్ రావు 71 శాతం, సురోజు శ్రీకర్ 70 శాతం, కందుకూరి పద్మభూషణ్ 70 శాతం మార్కులు సాధించారు.

**ఈసీఈ:** విభాగంలో వేముల రమ్య 85 శాతం, ఎర్ర ధన్యశ్రీ 82.5 శాతం, గోదా పూజిత 81 శాతం మార్కులతో ప్రతిభ చూపారు.

**సీఎస్ఈ:** విభాగంలో అచ్చే దుర్గాదీక్షిత 90.5 శాతం మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా, షేక్ ఇసుబ్ అలియా 87.5 శాతం, ఉప్పల శరణ్య, మల్లెల్లి రేణుక, రెడ్డి కావ్యాంజలి చెరో 87 శాతం మార్కులు సాధించారు.

**సీఎస్ఈ – ఏఐ & ఎంఎల్:** విభాగంలో మహమ్మద్ రజియా 80.5 శాతం, కాందూరి లక్ష్మి ప్రియ 80 శాతం, గుంట్రు రవీంద్ర, జంగాల హిమజ చెరో 79.5 శాతం మార్కులు సాధించారు.

**ఏఐ & డీఎస్:** విభాగంలో అమరవరపు మాధురి 84 శాతం, కారుమూరి ప్రణయ్ వెంకటసాయి, ముచ్చర్ల హేమంత్ సాయి సుబ్రహ్మణ్యం చెరో 83 శాతం, మల్కాపురం నవీన్ కుమార్ 81.5 శాతం మార్కులు సాధించారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన విద్యా ట్రస్ట్ శ్రీమతి బండి అన్విద వర్చువల్‌గా మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల సమిష్టి కృషే ఈ విజయానికి కారణమని పేర్కొంటూ అభినందించారు.

కళాశాల కార్యదర్శి మరియు ప్రతినిధి దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యలో పరీక్షలు విజయానికి ఒక దశ మాత్రమేనని, నిరంతర కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పాముల శేఖర్ బాబు, ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, వివిధ విభాగాధిపతులు విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆపదలో అపర సంజీవినిలా 108, 102 అంబులెన్స్ సేవలు

**– ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె. రవికుమార్**

**వనపర్తి,ఫిబ్రవరి10(తెలంగాణ ముచ్చట్లు):**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెన్స్ సేవలు అపర సంజీవినిలా ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలుస్తున్నాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె. రవికుమార్ పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలను వేగంగా, సమర్థవంతంగా అందిస్తున్నట్లు తెలిపారు.మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో 108 అంబులెన్సులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అంబులెన్సుల్లోని వైద్య పరికరాల పనితీరు, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులను, ఆపదలో ఉన్న వారిని తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తూ 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నాయని ఆయన తెలిపారు.అలాగే 102 అమ్మఒడి అంబులెన్సుల ద్వారా గర్భిణీ స్త్రీలను రక్తపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి, పరీక్షలు పూర్తైన అనంతరం తిరిగి ఇంటికి చేర్చడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయిన తర్వాత తల్లి, బిడ్డలను ఉచితంగా ఇంటి దగ్గర దించడంతో పాటు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కోసం కూడా అమ్మఒడి వాహనాలను వినియోగిస్తున్నట్లు వివరించారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108, 102 అంబులెన్సుల ద్వారా ప్రజలకు నిరంతరం వైద్య సహాయం అందిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కె. రవికుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెహబూబ్ బాషా, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బుద్వేష్, శశి, బీమేష్, పైలెట్లు భాస్కర్, నాగరాజు, శ్రీకాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్‌పూర్ ఆదర్శ పురుషుల పొదుపు సంఘం నుంచి ఆర్థిక భరోసా

**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 10( తెలంగాణ ముచ్చట్లు):**




గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఆదర్శ పురుషుల పొదుపు సంఘంలో రెగ్యులర్ మెంబర్‌గా కొనసాగుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన గండికోట లక్ష్మణ్ గారి నామినికి సంఘం తరఫున రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు రాజిరెడ్డి , సంఘ అధ్యక్షులు తాటికొండ అభిలాష్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సమితి గణకులు పున్నం చందర్ , సంఘ పాలకవర్గ సభ్యులు మరియు సంఘ గణకులు పాల్గొన్నారు.

సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ఆదర్శ పురుషుల పొదుపు సంఘం పనిచేస్తోందని, ఇలాంటి కష్టకాలంలో సభ్యుల కుటుంబాలకు అండగా నిలవడం సంఘ బాధ్యత అని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు సంఘాలు సామాజిక భద్రతకు దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# మేయర్ గద్వాల విజయలక్ష్మికి పత్తి కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు



**కాప్రా, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఐదు సంవత్సరాల పాటు ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తూ పరిపాలన సాగించిన కార్పొరేటర్లకు, ముఖ్యంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి కి కాంటెస్టెడ్ కాంగ్రెస్ కార్పొరేటర్ పత్తి కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మేయర్‌గా తన పదవీ కాలంలో ప్రజా సేవను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని నగరాభివృద్ధికి కృషి చేసిన తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పదవీ కాలం ముగిసినప్పటికీ, ప్రజలతో అనుబంధం కొనసాగిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వం అవసరమని, భవిష్యత్తులో కూడా మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రజా సేవా రంగంలో క్రియాశీలకంగా కొనసాగాలని పత్తి కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.




# కబ్జాదారుల నుంచి ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు రక్షణ

- సీఎం రేవంత్‌రెడ్డికి అల్వాల్ మాజీ మున్సిపల్ చైర్మన్ జీవన్ కృతజ్ఞతలు

**కాప్రా–యాప్రాల్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ కాప్రా డివిజన్ లో భూ కబ్జాదారుల నుంచి ఫుట్ బాల్ గ్రౌండ్‌ను పరిరక్షించి, దాని అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అల్వాల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జీవన్ కృతజ్ఞతలు తెలిపారు.కాప్రా-యాప్రాల్ ప్రాంతంలో నూతనంగా అభివృద్ధి చేయనున్న ఫుట్ బాల్ గ్రౌండ్‌కు మంగళవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 60 సంవత్సరాలుగా ఉన్న ఈ ఫుట్ బాల్ గ్రౌండ్‌కు నేడు అభివృద్ధి లభించడం శుభసూచకమని అన్నారు. గ్రౌండ్ అభివృద్ధి పూర్తయితే ఫుట్ బాల్ క్రీడాకారులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.స్థానిక యువతతో పాటు క్రీడాకారులకు ఈ గ్రౌండ్ ఎంతో ఉపయోగపడనుందని, క్రీడలకు ప్రాధాన్యతనిచ్చే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమని నాయకులు అభిప్రాయపడ్డారు.



# మణిగిల్లలో అచ్చన్న కాలువ శుభ్రత పనులు నీటి ప్రవాహం పునరుద్ధరణకు చర్యలు

- గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడి,ఫిబ్రవరి10 (తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో అచ్చన్న కాలువలో పేరుకుపోయిన జమ్ము మరియు కంప చెట్ల వల్ల వెంకన్న చెరువులోకి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో, గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాలువ శుభ్రత పనులు చేపట్టారు. దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున కాలువలో జమ్ము అధికంగా మొలవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది .ఈ పరిస్థితిని గమనించిన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కాలువ వద్దకు చేరుకొని, ఉపాధి కూలీల సహకారంతో పేరుకుపోయిన జమ్ము, కంప చెట్లను తొలగించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.కాలువ పనులు పూర్తయిన అనంతరం వెంకన్న చెరువులోకి నీటి ప్రవాహం మళ్లీ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలువల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇలాంటి పనులు తరచుగా చేపట్టి నీటి వృథా లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం గ్రామ పాలకవర్గం బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోతుల రామిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాంరెడ్డి, బోయిన్ కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, బీకే నాయుడు, చెన్న నాయుడు, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి వినతి

- 30 ఏళ్ల పాత డ్రైనేజ్‌తో ఇబ్బందులు
- మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేత

**కుషాయిగూడ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ కుషాయిగూడ ప్రాంతంలో అనేక వీధులలో ఉన్న డ్రైనేజ్ వ్యవస్థ సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించబడిన పాతదిగా ఉండటంతో, తరచూ మురుగు నీరు రోడ్లపైకి వచ్చి వీధులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఈ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డ్రైనేజ్ సమస్య వల్ల పరిశుభ్రత లోపించి, దుర్వాసనతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా మారుతున్నదని తెలిపారు.ఈ నేపథ్యంలో కుషాయిగూడలో డ్రైనేజ్ సమస్య ఉన్న వీధులలో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను తక్షణమే నిర్మించాలని కోరుతూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును, స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని వినతి పత్రంతో కలిసి కలిశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్యదర్శి పసగట్ల చక్రపాణి గౌడ్‌లతో పాటు పండాల శివకుమార్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చల్ల ప్రభాకర్, గంప కృష్ణ, యావపురం రవి, వెంకటేశ్వర్లు, కొడకండ్ల యాదయ్య, సల్ల వెంకటేష్, సారా అనిల్ ముదిరాజ్, పండాల గణేష్ గౌడ్, నల చెరువుల జనార్దన్, దయానంద్, ఆంజనేయులు యాదవ్, పులి నరేందర్, అనిల్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు

**నాచారం, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు)**




ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని బండబావి ప్రదేశంలో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హైద్రాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, యువత క్రీడల వైపు ఆకర్షితులై శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఆధునిక వసతులతో నిర్మించనున్న ఈ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థానిక యువతకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలను కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్‌గా తన ఐదేళ్ల పదవీకాలం చివరి రోజున ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు శంకుస్థాపన జరగడం తనకు గర్వకారణమని ప్రభుదాస్ తెలిపారు. ఈ ప్రాజెక్టు మంజూరు ప్రక్రియలో కీలకంగా సహకరించిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అనంతరం బండబావి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నమూనా డిజైన్‌ను మంత్రి శ్రీధర్ బాబు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రాజెక్టు రూపకల్పన, క్రీడా వసతులు, నిర్మాణ దశల వివరాలను మంత్రికి వివరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

- విజయవంతం చేయాలి అని సింగరేణి విశ్రాంతి కార్మికుల పిలుపు

**హనుమకొండ,ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి విశ్రాంతి కార్మికులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మాధవరావు అధ్యక్షత వహించారు.

ప్రతినెల ఒకసారి సమావేశం నిర్వహించుకుని పరస్పరం కలుసుకోవడం ఆరోగ్యపరంగా, మానసికంగా మేలు చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే మార్చి 2026లో జరగనున్న పెన్షనర్ల ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బొగ్గు గని కార్మికుల పెన్షన్‌ను పెంచడంతో పాటు సిపిఆర్ఎంఎస్ గ్రాంట్‌ను 20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ బొగ్గు గని కార్మికుల శ్రమ వల్లే దేశానికి విద్యుత్తు, వెలుగులు అందుతున్నాయని, అలాంటి కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. బొగ్గు గని కార్మికుల పెన్షన్‌ను వేజ్ బోర్డులో కలపాలని డిమాండ్ చేస్తూ, మార్చిలో జరగనున్న ధర్నాలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కోశాధికారి నలబాల దామోదర్ మాట్లాడుతూ మార్చి 10న జరగనున్న సమావేశంలో వృద్ధుల రక్షణ చట్టం-2007పై అవగాహన కల్పించేందుకు హెల్పేజ్ ఇండియా నుంచి శ్యామ్ అంగీకరించినట్లు తెలిపారు. ఆ సమావేశానికి అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశానికి 60 మందికి పైగా పెన్షనర్లు హాజరై విజయవంతం చేశారు. సి.హెచ్. సదానందం, రాజిరెడ్డి రామ్మూర్తి, హాసన్, గడ్డం వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్ తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొని సమ్మె, ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సేవాలాల్ విద్యార్థి సేన క్రికెట్ టోర్నమెంట్ 3వ రోజు పోటీలను ప్రారంభించిన యూనివర్సిటీ అధికారులు

**హనుమకొండ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకొని బంజారా విద్యార్థులు, సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీల మూడవ రోజును రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ రమేష్ నాయక్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో శక్తి, నైపుణ్యాలను వెలికితీసేలా క్రీడలు దోహదపడతాయని, క్రీడారంగంలో కూడా కాకతీయ యూనివర్సిటీ దేశ స్థాయిలో ముందుండేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతూ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. సేవాలాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి బంజారా విద్యార్థి బాధ్యతగా కృషి చేయాలని ప్రొఫెసర్ రమేష్ నాయక్ ఆకాంక్షించారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈ విధంగా క్రీడా పోటీలను నిర్వహించడంపై బంజారా విద్యార్థుల ఉత్సాహాన్ని యూనివర్సిటీ అధికారులు ప్రశంసించారు.

ఈ టోర్నమెంట్‌లో గిరిజన విద్యార్థులతో పాటు యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. దాదాపు 32 విభాగాలకు చెందిన విద్యార్థులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మూడవ శ్రీను, వెంకన్న, సచిన్, నరేష్, సంతోష్, చరణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం

- ఆదర్శంగా నిలిచిన అంబేద్కర్ యూత్ అసోసియేషన్

**పెద్దమందడి,ఫిబ్రవరి10(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి అంగన్‌వాడీ టీచర్ చిట్టెమ్మ ఆకస్మిక మృతి వారి కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది.నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె మరణంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు మానవత్వంతో ముందుకొచ్చి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ సభ్యులంతా కలిసి తమ వంతు సహాయంగా రూ. 20,000/(ఇరవై వేల రూపాయలు) నగదును సేకరించి, బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రధాన లక్ష్యమని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవలో ముందుండటం తమ బాధ్యతగా భావిస్తున్నామని, అవసరంలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు, గ్రామ పెద్దలు హర్షిస్తూ అభినందించారు.






# వైరా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10(తెలంగాణ ముచ్చట్లు)**

వైరా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైరా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు.
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లొకేషన్స్ గుర్తించి ఆయా కేంద్రాలలో సీసీ కెమెరా ద్వారా నిరంతర పర్యవేక్షిస్తామని తెలిపారు.
ప్రలోభాలకు గురి చేసే వారిపై నిఘా పెట్టాలని అన్నారు.ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వైరా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, హిస్టరీ దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు.




# ఘనంగా నరసింహారావు జన్మదిన వేడుకలు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10(తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం నగరంలోని జమ్మిబండ ఏరియాలో ఉన్న ఎస్.ఎస్. టాక్స్ కన్సల్టెన్సీ కార్యాలయంలో సోమవారం అలిశ్యం నరసింహారావు 60వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ శుభ సందర్భంగా వారి కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయగా, కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ వేడుకకు సర్‌ప్రైజ్‌గా 1980-81 విద్యా సంవత్సరానికి చెందిన చింతకాని హైస్కూల్ 10వ తరగతి బ్యాచ్ క్లాస్మేట్స్, అలాగే చిన్ననాటి మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నరసింహారావు ని అభినందించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకున్న స్నేహితులు తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేక్ కటింగ్ అనంతరం, స్నేహితులు, సహచరులు నరసింహారావు సేవలు, వృత్తిపరమైన నిబద్ధత, సమాజానికి అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితంలో ఇది ఒక మరపురాని మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం స్నేహం, అనుబంధం, గౌరవాన్ని ప్రతిబింబించేలా విజయవంతంగా ముగిసింది. ఈకార్యక్రమంలో పదో తరగతి బ్యాచ్ తాళ్లూరి వెంకటేశ్వరావు, గమిడి వెంకటేశ్వర్లు, గంటేల వెంకటేశ్వర్లు, కాసిమల్ల లక్ష్మయ్య, నన్నక మాధవరావు, ఆళ్ల రామారావు, తిరుపతి అంజయ్య, నన్నక సీతా రామయ్య, మిత్రులు సైదులు, భూషయ్య, బిక్కు సాహెబ్, రామ్మూర్తి, కృష్ణ, కుటుంబ సభ్యులు, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 11న ఓటు వేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అనుమతి మంజూరు

- **కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -10 (తెలంగాణ ముచ్చట్లు)**

ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న 5 మున్సిపాలిటీలు (కల్లూరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం) పరిధిలో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగానికి అనుమతి మంజూరు చేయాలని జిల్లాలోని ప్రభుత్వ శాఖాధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు.
ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే సిబ్బందికి కూడా ఓటు హక్కు వినియోగం కోసం తప్పని సరిగా అనుమతి మంజూరు చేయాలని, మున్సిపాలిటీలో ఓటు హక్కు ఉన్నట్లు ప్రభుత్వ సిబ్బంది సంబంధిత శాఖాధికారులకు వివరాలు సమర్పించి అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో కౌటిల్య స్కూల్ గిరిజన విద్యార్థుల ప్రతిభ

**హనుమకొండ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ నగరంలోని వికాస్‌నగర్‌లో ఉన్న కౌటిల్య స్కూల్‌లో చదువుతున్న గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభను చాటారు. రెండో తరగతి విద్యార్థి లావుడియా సంజీవ్, ఐదో తరగతి విద్యార్థి శ్రీమంతు నాయక్ హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వం ఎడ్యుకేట్ అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించారు. ఇందులో సంజీవ్ 'జీనియస్' అవార్డును, శ్రీమంతు 'రైజింగ్ స్టార్' అవార్డును అందుకున్నారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కౌటిల్య స్కూల్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎదుగుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారికి బలమైన భవిష్యత్తును అందించడంలో ముందంజలో ఉందని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ శాలిని, డైరెక్టర్ వర్మ, కరస్పాండెంట్ అశోక్ రెడ్డిని గిరిజన సంఘం తరఫున అభినందించారు.
చిన్న వయసులోనే రాష్ట్రస్థాయి అవార్డులు సాధించిన విద్యార్థులను గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న నాయక్, రమేష్ నాయక్, సరోజ బాయి, జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ శ్రీకాంత్, డీజే లాలూ, కవిత, కర్ణాకర్, ఆనంద్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



# రాపాకపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా పర్యవేక్షణ బృందం

**హనుమకొండ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**




ధర్మసాగర్ మండలంలోని రాపాకపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా పర్యవేక్షణ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.
పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు జి. ఇన్నారెడ్డి చేసిన కృషిని బృందం ప్రశంసించింది. విద్య, పరిసరాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, స్వంత ఖర్చులతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దిన విధానం ప్రశంసనీయమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో ఆదర్శవంతమైన సూక్తులు, నర్సరీ వాతావరణం, సమగ్రంగా రూపొందించిన విద్యా వాతావరణం మండలానికి ఆదర్శంగా ఉందని తెలిపారు.
బోధనలో ఇద్దరు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తుండటంతో పాటు, టీ.ఎల్.ఎమ్, పాఠశాల రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం ప్రభుత్వ నిబంధనల ప్రకారం, రుచికరంగా మెనూ అమలవుతోందని తెలిపారు.
అన్ని అంశాలు పరిశీలించిన అనంతరం పర్యవేక్షణ బృందం సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరికొన్ని సూచనలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి లూనావత్ నరేందర్ నాయక్, ప్రవీణ్, రాజేష్ టీచర్, స్కావెంజర్లు, వంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాపాకపల్లి ప్రాథమిక పాఠశాల రోల్ మోడల్‌గా నిలుస్తోందని, ఆట స్థలం, గ్రంథాలయం ఉన్నప్పటికీ మరికొన్ని గదుల అభివృద్ధికి అవకాశం ఉందని బృందం పేర్కొంది.



# నాచారం డివిజన్‌కు రూ.5.90 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

**నాచారం, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లో కీలక అభివృద్ధి పనులకు జిహెచ్‌ఎంసి చివరి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించింది. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థన మేరకు, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ చేసిన వినతికి స్పందించిన జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మొత్తం రూ.5 కోట్ల 90 లక్షల అభివృద్ధి పనులకు శాంక్షన్ ఇచ్చింది.నాచారం డివిజన్‌లోని హిందూ స్మశాన వాటికను ఆధునిక సదుపాయాలతో కూడిన వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు రూ.2 కోట్ల 90 లక్షలు మంజూరు చేశారు. అలాగే రైతు బజార్ పరిధిలోని ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించారు.ఈ అభివృద్ధి పనులకు సంబంధించి జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కీలక నిర్ణయం తీసుకున్నారు. నాచారం డివిజన్ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి సహకరించినందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌లు జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు, మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే నాచారం డివిజన్‌లో ప్రజలకు మరింత సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని వారు పేర్కొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- **నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **నాచారం సర్కిల్ కార్యాలయం ఏర్పాటుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**

**మల్లాపూర్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలో నాచారం సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసిన సందర్భంగా మల్లాపూర్‌లోని డివిజన్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, మక్తాల బాలరాజ్ గౌడ్, దంతూరి రాజు గౌడ్, కోయలకొండ రాజేష్, కప్పర సాయి, ఎస్.వి. కిట్టు, మెరుపుల బాలరాజ్, వి.శ్రీనివాస్, నుస్రత్ ఖాన్, పర్వతాలు, జానీ భాయ్, సాయి గౌడ్, మధు, నిక్కీ, టిల్లు, వినోద్ యాదవ్, విజయ్ రెడ్డి, అన్వర్, చారి, ఉపేందర్, పాషా, సాయి, హరి, రఘు, సురేష్, వినేష్ యాదవ్, యాద్గిరి, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకురాళ్లు జమీలా, శైలజ, సోనీ, ఇష్రత్ బానో, కవితలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా మల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ శక్తిని మరింత బలోపేతం చేయాలన్న సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు.




# గోగికార్ శివకుమార్ జన్మదిన సందర్భంగా కాప్రా డివిజన్‌లో సేవా కార్యక్రమాలు

- **చీరల పంపిణీతో ప్రజల నుంచి విశేష స్పందన**

**కాప్రా, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోగికార్ శివకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని డివిజన్ పరిధిలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాసేవే లక్ష్యంగా తన జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా జరుపుకోవడం అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు.ఈ సందర్భంగా గాంధీ నగర్‌లో 300 మందికి, కాప్రా ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో 400 మందికి, వంపుగూడ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 300 మందికి చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సేవా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్టేట్ డైనమిక్ లీడర్ సోమశేఖర్ రెడ్డి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఉప్పల్ మైనారిటీ లీడర్ బద్రుద్దీన్, టీఆర్‌ఎస్ నాయకుడు రాగి ఎట్లా కృష్ణ (కిట్టు)తో పాటు పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోగికార్ శివకుమార్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా కాప్రా డివిజన్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం సేవ చేస్తానని ఆయన అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఆరోగ్యం.. 'ఆయన' ఇచ్చిన వరం!

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు)**

వ్యాధి ఒక పరీక్ష.. చికిత్స ఒక బాధ్యత.. ప్రార్థన ఒక శక్తి!

మనిషికి ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే అన్నీ శూన్యమే. కానీ నేటి కాలంలో రోగం రాగానే మనిషి కుప్పకూలిపోతున్నాడు. నిరాశలో మునిగిపోతున్నాడు. అయితే, 14 శతాబ్దాల క్రితమే ఇస్లాం కేవలం ధర్మాన్నే కాదు.. ఒక సంపూర్ణ ఆరోగ్య వ్యవస్థను కూడా మానవాళికి పరిచయం చేసింది. అనారోగ్యం కలిగినప్పుడు కుంగిపోవద్దు, అది అల్లాహ్ నిన్ను పలకరించే ఒక మార్గం అని ఇస్లాం చాటిచెబుతోంది.

**రోగాన్ని ద్వేషించకు.. అది నిన్ను శుద్ధి చేస్తుంది!**

అనారోగ్యాన్ని ఇస్లాం ఒక శిక్షగా చూడదు. అల్లాహ్ తన భక్తుడిని పరీక్షించడానికి లేదా అతని పాపాలను తుడిచివేయడానికి ఇచ్చే ఒక అవకాశంగా పరిగణిస్తుంది. "ఒక ముస్లింకు ముల్లు గుచ్చుకున్నా, దాని ప్రతిఫలంగా అల్లాహ్ అతని పాపాలను క్షమిస్తాడు" అన్న ప్రవక్త (స) వాక్కు రోగిలో కొండంత ధైర్యాన్ని నింపుతుంది. ఈ భావన రోగిని మానసిక ఒత్తిడి నుండి కాపాడి, త్వరగా కోలుకునేలా చేస్తుంది.

**వైద్యం చేయించుకోవడం ధర్మం!**

"అల్లాహ్ రోగాన్ని ఇచ్చాడు కదా, ఆయనే నయం చేస్తాడులే" అని కూర్చోవడం సరైన పద్ధతి కాదని ఇస్లాం బోధిస్తుంది. ముసలితనం మినహా ప్రతి జబ్బుకు అల్లాహ్ ఒక నివారణను (ఔషధాన్ని) సృష్టించాడు. కాబట్టి వైద్యుడిని సంప్రదించడం, మందులు వాడటం ప్రవక్త వారి సూచన. ప్రకృతి ప్రసాదించిన తేనె, నల్ల జీలకర్ర వంటి సహజ సిద్ధమైన ఔషధాల ప్రాముఖ్యతను ఇస్లాం ఎంతో గొప్పగా వివరించింది.

**దువా.. మందు కన్నా పదునైనది!**

మందు శరీరానికి అయితే.. దువా (ప్రార్థన) ఆత్మకు. మందు వేసుకున్నప్పుడు "నిశ్చయంగా నయం చేసేవాడు అల్లాహ్ మాత్రమే" అనే నమ్మకం ఉండాలి. ఖురాన్‌లోని ప్రతి అక్షరం ఒక షిఫా (నివారణ). ముఖ్యంగా మానసిక వ్యాధులకు, గుండె నిబ్బరానికి దైవ స్మరణే అసలైన ఔషధం. "అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలకు శాంతి లభిస్తుంది" అన్న ఖురాన్ వాక్యం అక్షర సత్యం.

**ముందు జాగ్రత్తే అసలైన నివారణ**

రోగాలు వచ్చిన తర్వాత బాధపడటం కంటే, రాకుండా చూసుకోవడం మిన్న. పరిశుభ్రతే విశ్వాసంలో సగం అని ఇస్లాం చెప్పింది. ఐదు పూటల నమాజ్ ద్వారా లభించే శారీరక కదలికలు, అశౌచం నుండి దూరంగా ఉండటం, మితాహారం తీసుకోవడం ఇవన్నీ మనిషిని రోగాల బారిన పడకుండా కాపాడే కవచాలు.

**ఒకరికొకరు తోడుగా..**

వ్యాధిగ్రస్తుడిని పరామర్శించడం ఇస్లాంలో ఒక గొప్ప పుణ్యకార్యం. రోగి దగ్గరకు వెళ్లినప్పుడు అల్లాహ్ అక్కడ ఉంటాడని ప్రవక్త సెలవిచ్చారు. వారికి ధైర్యం చెప్పడం, కష్టకాలంలో అండగా నిలవడం సమాజంలో ఒకరిపై ఒకరికి ఉన్న బాధ్యత.

ముగింపు:

శరీరం మనం సంపాదించుకున్నది కాదు, అది అల్లాహ్ మనకు ఇచ్చిన ఒక 'అమానత్' (భరోసా). దాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం. వైద్య చికిత్సను, ఆధ్యాత్మిక శక్తిని జోడిస్తేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడు.

-ముహమ్మద్ ముజాహిద్



# జీహెచ్ఎంసీ సిబ్బందికి కార్పొరేటర్ శాలువాలతో సన్మానం

- పదేళ్ల పాలన పూర్తి సందర్భంగా నాచారం డివిజన్‌లో కార్యక్రమం

**నాచారం, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లో పది సంవత్సరాలుగా కార్పొరేటర్‌గా సేవలందిస్తున్న శాంతి సాయిజన్ శేఖర్, తన విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో నిరంతరం సహకరించిన జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సేవలో భాగంగా సిబ్బంది చేసిన సేవలు అమూల్యమైనవని పేర్కొంటూ, వారి కృషిని గుర్తించి ఘనంగా సత్కరించారు.సికే గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం లో జీహెచ్ఎంసీ సిబ్బందిని శాలువాలతో సన్మానించడంతో పాటు, మహిళా సిబ్బందికి చీరలు, ఇతర సిబ్బందికి బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తన పదేళ్ల ప్రజాప్రతినిధి ప్రయాణంలో జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారం కీలక పాత్ర పోషించిందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు.ఇదే సందర్భంగా పదేళ్ల పాలన పూర్తి చేసుకున్న కార్పొరేటర్‌కు నాచారం డివిజన్ టీఆర్ఎస్ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేశారు. గత పది సంవత్సరాలుగా నాచారం డివిజన్ అభివృద్ధికి కార్పొరేటర్ చేసిన సేవలను నాయకులు కొనియాడారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు.కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతోనే ఈ పదేళ్ల సేవా ప్రయాణం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా నాచారం డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, డివిజన్ టీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 సమ్మెకు దూరంగా ఉండాలి.!

- సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12వ తేదీన తలపెట్టిన ఒక్క రోజు సమ్మె నేపథ్యంలో, సింగరేణి సత్తుపల్లి ఏరియా జి.ఎం కార్యాలయంలో మంగళవారం అన్ని యూనియన్ల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, సత్తుపల్లి ఏరియా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏరియా జి.ఎం మాట్లాడుతూ, కార్మిక సంఘాలు ప్రకటించిన సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విధులకు హాజరై సంస్థ లక్ష్య సాధనలో సహకరించాలని కోరారు. కొన్ని కార్మిక సంఘాలు సింగరేణి కార్మికులు కూడా ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చినప్పటికీ, సమ్మె డిమాండ్లలో అధిక భాగం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని, వాటిని సింగరేణి యాజమాన్యం పరిష్కరించగల పరిస్థితి లేదని తెలిపారు. సింగరేణి పరిధిలోని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పుడు, ఈ సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం ఉందా అనే అంశాన్ని కార్మికులు ఆలోచించాలని సూచించారు. వివిధ కారణాల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపులో కొంత వెనుకబడ్డామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిరోజు జరిగే ఉత్పత్తి కూడా లక్ష్యసాధనకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగాలంటే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

*ఒక్క రోజు సమ్మె జరిగితే కలిగే నష్టాలు:*

కంపెనీకి ఉత్పత్తి నష్టం విలువ - సుమారు రూ.77 కోట్లు

కార్మికులు కోల్పోయే వేతనాలు - సుమారు రూ.12 కోట్లు.

ఒక్క రోజు బొగ్గు ఉత్పత్తి నష్టం - సుమారు 2.20 లక్షల టన్నులు.

గత ఆర్థిక సంవత్సరం 2024-25లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగిందని తెలిపారు. లాభాల బోనస్, పిఎల్‌ఆర్ బోనస్‌లను ఉద్యోగులకు చెల్లించడంతో పాటు, వివిధ సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు 49 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, మిగిలిన 23 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన రెండు నెలలు ప్రతి రోజు కష్టపడి పని చేయాల్సి ఉందని తెలిపారు. అందువల్ల ఫిబ్రవరి 12న తలపెట్టిన సమ్మెకు దూరంగా ఉండి విధులు నిర్వహించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్.ఓ టు జి.ఎం బొల్లం శ్రీనివాసు, ప్రాజెక్టు ఆఫీసర్లు జెవిఆర్ ఓసీ ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, కిష్టారం ఓసీ ఎ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ, ఏరియా ఇంజినీర్ కే. సోమశేఖర్, కాలరీ మేనేజర్లు జెవిఆర్ ఓసీ బి. రాజేశ్వర రావు, కిష్టారం ఓసీ రామకృష్ణ, సంక్షేమ అధికారులు కావ్య, శ్రీనివాస్, సత్తుపల్లి ఏరియా జెవిఆర్ ఓసీ, జెవిఆర్ సిహెచ్‌పి, కిష్టారం ఓసీలకు చెందిన గుర్తింపు సంఘాలు, ప్రాతినిధ్య సంఘాలు మరియు ఇతర యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలలో బీసీల ఓటు బీసీలకే

- జనరల్ స్థానాల బరిలో ఉన్న బీసీలను పార్టీలకు అతీతంగా గెలిపించండి
- బీసీ రిజర్వేషన్లు తగ్గించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయి
- రాజకీయ పార్టీలను చూడొద్దు బీసీ నా కాదా అని చూసి ఓటు వేయండి
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**వరంగల్,ఫిబ్రవరి10(తెలంగాణ ముచ్చట్లు):**



వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం ఆవరణలో పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికలలో రాజకీయ పార్టీల అతీతంగా జనరల్ స్థానాలలో ఎన్నికల బరిలో నిలబడిన బీసీలను గెలిపించాలని బీసీ జేఏసీ నిర్ణయించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మరియు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునివ్వడం జరిగిందని డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. కావున ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్కాల మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటు మనదే సీటు మనదే, బీసీల ఓటు బీసీలకే అనే నినాదంతో బీసీలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో బీసీ బిడ్డలను గెలిపించి వరంగల్ జిల్లాలో బీసీ ల రాజకీయ ఐక్యతతో పాటు సామాజిక చైతన్యాన్ని చాటాలని డ్యాగల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ లు అమలవుతుండగా పది శాతం ఉన్న అగ్రకులాలు 50 శాతం జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్నారని జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావు లవి కావని అన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 28 శాతం రిజర్వేషన్లను మాత్రమే కల్పించారని కావున రిజర్వేషన్లు లేని జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్న బీసీలను గెలిపించడం ద్వారా బీసీలకు రాజకీయంగా న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల లాగానే ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీసీలు ఓటు అనే ఆయుధంతో అగ్రకులాలను ఓడించి బీసీ రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లను తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేశాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి బుద్ధి చెప్పాలంటే మున్సిపల్ ఎన్నికలను ఒక వేదికగా చేసుకుని బీసీలు రాజకీయ పార్టీలను చూసి నేర్చుకోవాలని సూచించారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు సోదర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలతో ఏకమై బీసీలను అత్యధికంగా గెలిపించుకుని బీసీల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవాలని శ్రీనివాస్ బీసీ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా యూత్ అధ్యక్షుడు కదారి సురేష్ యాదవ్, నర్సంపేట మండల నాయకులు మారపాక రమేష్ ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, శీరంశెట్టి రాజేందర్ పెరక తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కులను కార్పొరేట్ లాభాలకు తాకట్టు పెట్టారు

- లేబర్ కోడ్లతో ఉద్యోగ భద్రత, యూనియన్ హక్కులకు ముప్పు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

**నాచారం, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**





ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయని, ఈ చారిత్రక సత్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ మంగళవారం నాచారం చౌరస్తాలో నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ జిల్లా సీఐటీయూ కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్మిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కార్మికుల రక్తత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలైతే ఉద్యోగ భద్రతతో పాటు ట్రేడ్ యూనియన్ హక్కులు పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు.పర్మినెంట్ ఉద్యోగాలను తొలగించి కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేయాలన్న ప్రభుత్వ యత్నం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు. షాహీ పరిశ్రమలో 1,600 మంది మహిళా కార్మికులు పది రోజులపాటు రాత్రింబవళ్లు పోరాడి తమ వేతన హక్కులు సాధించుకున్న ఉదాహరణను గుర్తు చేస్తూ, పోరాటం లేకుండా హక్కులు లభించవని స్పష్టం చేశారు.లేబర్ కోడ్ల పేరుతో అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోసు, ఐఎన్టీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు-రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు.సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ నాయకులు శివబాబు, ప్రవీణ్, ఎన్ఐఈయూ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది.. బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!

- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం: మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు
- పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం.. 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10(తెలంగాణ ముచ్చట్లు)**



రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం**

"ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు కాంగ్రెస్ వే**

రేపు (బుధవారం) జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుంది" అని అన్నారు.

**అభివృద్ధికి పెద్ద పీట...**

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

**కీసర, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మహాశివరాత్రి సందర్భంగా మేడ్చల్ జిల్లా కీసరగుట్టలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భవాని శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, కార్యనిర్వాహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డి కలిసి ముఖ్యమంత్రికి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు.బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ అధికారులు సీఎంకు వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ మను చౌదరి పరిశీలన

**మేడ్చల్–మల్కాజ్గిరి, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లేతో కలిసి మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు ఉపయోగించే సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రి, ఎన్నికల సిబ్బంది నిర్ణీత సమయంలో పోలింగ్ బూతులకు చేరుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

# ఉప్పల్‌లో రూ.110 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మంత్రి శ్రీధర్ బాబు

**ఉప్పల్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**




ఉప్పల్ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ఉప్పల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.సుమారు రూ.110 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులు నియోజకవర్గ రూపురేఖలను మార్చనున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ క్రీడా మైదానాలు, ఇండోర్-ఔట్డోర్ గేమ్స్ కాంప్లెక్స్, స్కూల్ భవనాల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నామని తెలిపారు.చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా తెలంగాణ బిడ్డలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భారత సైన్య ఆధునికీకరణపై ఐఐటీ కాన్పూర్‌తో చర్చలు

- వీసీఓఏఎస్ పుష్పేంద్ర సింగ్ పర్యటన
- ఏఐ, డ్రోన్లు, సైబర్ భద్రతపై దృష్టి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత సైన్యం సాంకేతిక ఆధునికీకరణకు సంబంధించిన సహకార అవకాశాలను విస్తరించే దిశగా ఉప సైన్యాధిపతి (వీసీఓఏఎస్) లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్ ఐఐటీ కాన్పూర్ ను సందర్శించారు. ఈ పర్యటనలో సాంకేతిక ఆధారిత ఆధునికీకరణ కోసం విద్యా-పరిశోధనా సంస్థలతో భారత సైన్యం అనుసంధానం మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశాల్లో కృత్రిమ మేధస్సు, స్వయం నియంత్రిత వ్యవస్థలు, సైబర్ భద్రత, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వంటి ఎదుగుతున్న సాంకేతికతలను వినియోగించి స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంపై దృష్టిసారించారు. స్వదేశీ పరిష్కారాల ద్వారా ఆధునిక యుద్ధ అవసరాలకు తగిన సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని వీసీఓఏఎస్ నొక్కి చెప్పారు.

పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్ హెలికాప్టర్ & వీటీఓఎల్ ల్యాబొరేటరీ, యూఏవీ ల్యాబ్, సీ3ఐహబ్‌లను పరిశీలించారు. డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో జరుగుతున్న పరిశోధనల పురోగతిని అక్కడి శాస్త్రవేత్తలు వివరించారు. నిష్ సాంకేతికతల అభివృద్ధిలో ఐఐటీ కాన్పూర్ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఈ పర్యటన ద్వారా ఐఐటీ కాన్పూర్ రక్షణ రంగంలో ఇన్నోవేషన్‌కు కీలక పాత్ర పోషిస్తున్నదని, భారత సైన్యం తో ఉన్న భాగస్వామ్యం మరింత బలపడుతున్నదని స్పష్టమైంది. విద్యా సంస్థలు-సైన్యం మధ్య కొనసాగుతున్న సమన్వయం భవిష్యత్తులో అత్యాధునిక స్వదేశీ రక్షణ పరిష్కారాలకు దారితీస్తుందని వీసీఓఏఎస్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ పరిణామాలతో దేశం సిగ్గుపడుతోంది: కంగనా రనౌత్

- రాహుల్ గాంధీ ప్రస్తావన చట్టవిరుద్ధమని ఆరోపణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**




ప్రతిపక్ష పార్టీలు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి దేశం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె, విపక్షాల వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. "అనధికారికమైన, చట్టబద్ధత లేని పుస్తకాన్ని సభకు తీసుకువచ్చి న్యాయ వ్యవస్థను అవమానించారు. ఇది చట్టవిరుద్ధమని ప్రచురణ సంస్థ కూడా స్పష్టం చేసింది" అని ఆమె వ్యాఖ్యానించారు.

ప్రతిపక్ష ఎంపీలు సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసరడం, టేబుళ్లపైకి ఎక్కడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని కంగనా ఆరోపించారు. "ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని సభకు వస్తే భద్రత ఎలా ఉంటుంది? ప్రధాని నరేంద్ర మోదీపై దాడి చేయరని గ్యారెంటీ ఏంటి?" అని ఆమె ప్రశ్నించారు. మహిళా ఎంపీలను అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలు చేయడం పార్లమెంట్ గౌరవానికి భంగం కలిగిస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగనీయకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆమె విమర్శించారు. ఈ గందరగోళం కారణంగా లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడిందని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీలు 'మాకు న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేయగా, బడ్జెట్ చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కోరినట్లు ఆమె గుర్తుచేశారు.

# లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస నోటీసు

- స్పీకర్ పదవి నుంచి తొలగింపునకు ప్రతిపక్షాల ప్రయత్నం
- 120 మంది ఎంపీల సంతకాలు
- రాజ్యాంగ ఆర్టికల్ 94-సీ ప్రకారం నోటీసు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చింది. స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఈ నోటీసు సమర్పించినట్లు కాంగ్రెస్ వెల్లడించింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా విపక్ష నేత *రాహుల్ గాంధీ*కి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపించింది. అంతేకాదు, ఎనిమిది మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే చేసిన నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను అవిశ్వాసానికి కారణాలుగా ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అవిశ్వాస నోటీసు అనంతరం కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 94సీ ప్రకారం ఈ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే సహా పలు పార్టీలకు చెందిన మొత్తం 120 మంది ఎంపీలు ఈ అవిశ్వాస నోటీసుకు సంతకాలు చేశారని వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను విపక్షాలు లేవనెత్తకుండా స్పీకర్ పదేపదే అడ్డుకోవడం తమను తీవ్రంగా బాధించిందని గౌరవ్ గొగోయ్ అన్నారు. పలు సందర్భాల్లో విపక్ష నేతలకు మాట్లాడే హక్కును నిరాకరించారని, అది ఎంపీల ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. రాజ్యాంగపరమైన హక్కులను వినియోగించుకున్నందుకే ఎనిమిది మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

# నరవణే పుస్తకంపై వివాదం

- లోక్‌సభలో ప్రస్తావనతో రాజుకున్న రాజకీయ వేడి
- పెంగ్విన్ ప్రకటన–రాహుల్ ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం రాజకీయంగా వివాదాస్పదంగా మారింది. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలను ఇటీవల రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో వారం రోజులుగా లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ఈ అంశంపై నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని, లింక్ ఓపెన్ చేస్తే విషయాలు తెలుస్తాయని నరవణే ట్వీట్‌లో పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఈ పుస్తకాన్ని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, సంస్థ మాత్రం ఇప్పటివరకు పుస్తకాన్ని విడుదల చేయలేదని తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ కీలక ప్రశ్నలు లేవనెత్తారు. నరవణే అబద్ధం చెబుతున్నారా? లేక పెంగ్విన్ సంస్థ అబద్ధం చెబుతోందా? అని ప్రశ్నించారు. ప్రింట్ లేదా డిజిటల్ ఫార్మాట్‌లో పుస్తకాన్ని విడుదల చేయలేదని పెంగ్విన్ స్పష్టం చేస్తుండగా, అమెజాన్‌లో పుస్తకం అందుబాటులో ఉందని తాను చెబుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కంటే నరవణే వ్యాఖ్యలనే నమ్ముతున్నానని, నరవణే అబద్ధం చెప్పరని భావిస్తున్నానని రాహుల్ తెలిపారు. ఈ విభేదాల మధ్య నిజం ఏంటన్నది ఇప్పటికీ నిర్ధారణ కాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

# 114 రఫేల్ యుద్ధ విమానాలకు రంగం సిద్ధం

- రూ.3.25 లక్షల కోట్ల డీల్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం త్వరలో
- మేక్ ఇన్ ఇండియాలో 100 జెట్లు – భారత వాయుసేనకు భారీ బలం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



భారత వాయుసేన శక్తిని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయానికి సిద్ధమవుతోంది. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్‌ఎఫ్‌ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఈ వారంలోనే రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపే అవకాశం ఉందని సమాచారం. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం భారత రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్ద డీల్‌గా నిలవనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భారత్ పర్యటనకు కొద్దిరోజుల ముందే ఈ పరిణామం చోటు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం యుద్ధ విమానాల కొనుగోలుకే పరిమితం కాదని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో భాగంగా దాదాపు 100 రఫేల్ యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీ, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ డీల్‌లో ఉన్నాయి. ఈ ఒప్పందం ఖరారైతే, ఫ్రాన్స్ తర్వాత అత్యధిక సంఖ్యలో రఫేల్ యుద్ధ విమానాలను వినియోగిస్తున్న దేశాలలో భారత్ ఒకటిగా నిలవనుంది.

భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ 'C' వేరియంట్ యుద్ధ విమానాలు ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో చివరి రఫేల్ జెట్ వాయుసేనకు అందింది. వీటిని అంబాలాలోని 'గోల్డెన్ యారోస్' (నెం.17 స్క్వాడ్రన్), బెంగాల్‌లోని హసిమారాలో ఉన్న 'ఫాల్కన్స్' (నెం.101 స్క్వాడ్రన్)లలో మోహరించారు. వీటితో పాటు రూ.63 వేల కోట్లతో 26 నేవల్ వేరియంట్ రఫేల్ M యుద్ధ విమానాల కొనుగోలుకు కూడా భారత్ ఇప్పటికే ఆర్డర్ ఇచ్చింది. ఈ నేవల్ వేరియంట్ జెట్లు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య పై మోహరించనున్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించనుంది. రఫేల్ జెట్‌కు సంబంధించిన ఫ్యూజ్‌లేజ్ సెక్షన్లను దేశీయంగానే తయారు చేయనున్నారు. 2028 నాటికి తొలి ఫ్యూజ్‌లేజ్ సెగ్మెంట్లు సిద్ధమయ్యేలా ప్రణాళిక రూపొందించారు. నెలకు రెండు పూర్తి ఫ్యూజ్‌లేజ్‌ల తయారీ లక్ష్యంగా ఈ యూనిట్ పని చేయనుంది. అంతిమ అసెంబ్లింగ్ మాత్రం ఫ్రాన్స్‌లోని డస్సాల్ట్ ఏవియేషన్ కేంద్రంలో జరుగుతుంది.

గతేడాది మేలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', అలాగే లఢక్ సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో రఫేల్ యుద్ధ విమానాలు తమ సత్తా చాటిన సంగతి తెలిసిందే. 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే 'స్కాల్ప్' క్రూయిజ్ క్షిపణులు, మెటియోర్, హ్యామర్ వంటి శక్తిమంతమైన ఆయుధాలను మోయగల సామర్థ్యం రఫేల్‌కు ఉంది. ఈ భారీ ఒప్పందంతో భారత వాయుసేన సామర్థ్యం గణనీయంగా పెరిగి, దేశ భద్రత మరింత బలపడనుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన
# నిధుల విడుదలలో జాప్యం



◆ పార్లమెంటులో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన కింద తెలంగాణకు మంజూరైన నిధులను విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమంపై కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డైరీ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఇచ్చిన సమాధానంతో కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమైందని ఆమె తెలిపారు. 2020-21 నుంచి తెలంగాణకు రూ.196.80 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినప్పటికీ, కేంద్ర వాటా రూ.68.14 కోట్లలో గత మూడు సంవత్సరాల్లో కేవలం రూ.13.34 కోట్లు మాత్రమే విడుదల చేశారని పేర్కొన్నారు. 2022-23 సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలిపారు.

హ్యాచరీలు, పునర్వినియోగ జలకృషి యూనిట్లు, కేజ్ కల్చర్, చిన్న మేత మిల్లులు, జీవ చేపల విక్రయ కేంద్రాలకు కాగితాలపై ఆమోదాలు ఇస్తూ, క్షేత్రస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల వరంగల్, హనుమకొండ పరిసర జిల్లాల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,54,432 మంది లబ్ధిదారులు ఉన్నారని చెబుతున్న కేంద్రం, నిజంగా మత్స్యకారులకు మేలు చేయాలనుకుంటే పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆధునిక చేపల మార్కెట్‌లు, చేపల విక్రయ కేంద్రాలు, వాహనాల వంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వరంగల్ వంటి ప్రాంతాలను విస్మరించడం అన్యాయమని పేర్కొన్నారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని కడియం కావ్య స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో
# బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి




### ప్రజలు చైతన్యంతో ఓటు వేయాలి

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ గుర్రపు ప్రవీణ్

**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీకి నేడు జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్,11వ వార్డు బాధ్యులు గుర్రపు ప్రవీణ్ ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికలు పట్టణ భవిష్యత్తును నిర్ణయించేవి కావడంతో ప్రతి ఓటు కీలకమని తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని అన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి పార్టీ చేసిన కృషే అభ్యర్థుల బలమని పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గుర్రపు ప్రవీణ్ విమర్శించారు. ధరల పెరుగుదల, అభివృద్ధి పనుల నిలిచిపోవడం, మున్సిపాలిటీలకు సరైన నిధులు విడుదల చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. నేడే ఎన్నికలు కావడంతో ప్రతి కార్యకర్త,వార్డు నాయకుడు అప్రమత్తంగా పనిచేస్తూ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పట్టణ అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం తప్పనిసరని, ప్రజలు చైతన్యంతో ఓటు హక్కును వినియోగించాలని గుర్రపు ప్రవీణ్ పిలుపునిచ్చారు.

# పోస్టాఫీస్ అద్భుత పథకం..
# నెలనెలా రూ.17 వేల ఆదాయం




రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రత ప్రతి ఒక్కరికీ ముఖ్యమైన అంశం. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న మార్కెట్ పరిస్థితుల్లో పెట్టుబడులు సురక్షితంగా ఉండటంతో పాటు స్థిరమైన ఆదాయం రావాలని చాలామంది ఆశిస్తున్నారు. అలాంటి సీనియర్ సిటిజన్ల కోసం పోస్టాఫీస్ అందిస్తున్న సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (SCSS) ప్రస్తుతం మంచి ఆదరణ పొందుతోంది. ప్రభుత్వ హామీ ఉండటంతో రిస్క్ లేకుండా స్థిరమైన వడ్డీ అందించే పథకంగా ఇది నిలుస్తోంది.

ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 8.2 శాతం వడ్డీని అందిస్తోంది. ఇది అనేక బ్యాంకులు ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్ల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. పెట్టుబడిదారులకు సురక్షితమైన ఆదాయం అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా మధ్యతరగతి వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ పథకంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

నెలకు రూ.17 వేల ఆదాయం ఎలా?


ఈ పథకంలో గరిష్ఠంగా ఒక వ్యక్తి రూ.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఉదాహరణకు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే 8.2 శాతం వడ్డీ ప్రకారం ఏడాదికి సుమారు రూ.2,05,000 వరకు వడ్డీ లభిస్తుంది. అంటే నెలకు సగటున రూ.17,083 వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఈ వడ్డీని ప్రతి మూడు నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తారు. అంటే మూడు నెలలకు సుమారు రూ.51,250 వరకు పొందవచ్చు.

అర్హతలు - ముఖ్య వివరాలు

ఈ పథకాన్ని కనీసం రూ.1,000తో ప్రారంభించవచ్చు. సాధారణంగా 60 ఏళ్లు పూర్తైన వారు అర్హులు. అయితే స్వచ్ఛంద పదవీ విరమణ (VRS) తీసుకున్న వారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య, రిటైర్డ్ రక్షణ సిబ్బంది 50 ఏళ్ల తర్వాత కూడా ఇందులో చేరే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80C కింద ఏడాదికి రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఈ పథకం కాలపరిమితి 5 సంవత్సరాలు. గడువు పూర్తైన తర్వాత మరో 3 సంవత్సరాల పాటు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. అవసరమైతే నిబంధనల ప్రకారం కొంత జరిమానా చెల్లించి ముందుగానే ఖాతాను మూసివేయవచ్చు. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో మొత్తం డబ్బు వడ్డీతో సహా నామినీకి అందజేస్తారు. రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం పొందుతూ ఎవరిపైనా ఆధారపడకుండా జీవించాలనుకునే వారికి పోస్టాఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ మంచి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.

# ట్యాక్స్ పేయర్లకు అలర్ట్... ఏప్రిల్ 1 నుంచి కొత్త రూల్స్

దేశంలోని ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులను తీసుకురానుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ట్యాక్స్ రూల్స్ అమలులోకి తీసుకురావాలని ఆదాయపు పన్ను శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ముసాయిదా నియమాలను విడుదల చేసి ప్రజాభిప్రాయాలను కోరుతోంది. పన్ను చెల్లింపు విధానాన్ని మరింత సులభతరం చేయడం, పారదర్శకత పెంచడం, టెక్నాలజీ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడం ఈ మార్పుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. ఫిబ్రవరి 22, 2026 వరకు నిపుణులు, పన్ను సలహాదారులు, సాధారణ పన్ను చెల్లింపుదారుల నుంచి సూచనలు స్వీకరించనున్నారు. కొత్త నిబంధనల్లో భాగంగా ఐటీ రిటర్న్ ఫారమ్‌లను పూర్తిగా రీడిజైన్ చేశారు. వీటిని 'స్మార్ట్ ఫారమ్స్'గా రూపొందించారు. జీతాలు, బ్యాంక్ వడ్డీ ఆదాయం, పెట్టుబడులు, పన్ను మినహాయింపులు వంటి వివరాలు ఆటోమేటిక్‌గా ఫారమ్‌లలో కనిపించేలా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పన్ను చెల్లింపుదారులు పదేపదే ఒకే సమాచారాన్ని నమోదు చేయాల్సిన అవసరం తగ్గుతుంది. తప్పిదాలు తగ్గి, రిటర్న్ ఫైలింగ్ ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు చెబుతున్నారు. పన్ను చట్టాల్లో ఉండే క్లిష్టమైన సాంకేతిక పదాలను తగ్గించి, సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా సరళమైన భాషను ఉపయోగించడం మరో ముఖ్యమైన మార్పు. గతంలో పన్ను నిబంధనల్లో స్పష్టత లేకపోవడం వల్ల వివాదాలు, నోటీసులు పెరిగేవి. కొత్త నియమాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం వల్ల అలాంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగులు, చిన్న వ్యాపారవేత్తలకు ఇది పెద్ద ఊరటనివ్వనుందని భావిస్తున్నారు. ఇకపై పేపర్ ఫైలింగ్ కంటే పూర్తిగా ఎలక్ట్రానిక్ ఫైలింగ్‌కే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. డిజిటల్ విధానాల ద్వారా పన్ను శాఖతో కమ్యూనికేషన్ సులభమవుతుందని, ప్రక్రియలు వేగంగా పూర్తవుతాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం విడుదలైనవి ముసాయిదా నియమాలే కావడంతో తుది నిర్ణయం తర్వాతే పూర్తి అమలు జరుగుతుంది. కొత్త వ్యవస్థ అమల్లోకి రానున్న నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు మార్పులపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.




# మాటివ్వడం అంటే?!

మాటివ్వడం అంటే అప్పటికప్పుడు పలికే
కాలం కొనుగోలు చేసే ఓ వాక్యం కాదు.

కొన ఊపిరితో కుదేలవుతున్న నమ్మకాన్ని..
వెంటిలేటర్ పై పెట్టి బతికించడం..
ఆశల చేను ఎండిపోతున్నా,గుండె పొలంపై చేసే సాక్షి సంతకం.

మాటేమి.. ఊసరవెల్లి కాదు ..
పూటకో రంగు మార్చడానికి..
నీ వ్యక్తిత్వానికి అద్దం పట్టే మరో రూపం అది.

ఒక్కసారి మాటిచ్చాక, అలలు తిరగబడినా.. తీరాలు దారి తప్పినా
నేనున్నానంటు ఓ నావికుడివై తనని ముందుకే నడిపించాలి నువ్వు.

లోతుకి భయపడో ..
చేతకాని తనంతోనో
మధ్యలో తనని వదిలెళ్ళిన
లేక వెనుదిరిగిన నువ్వు కేవలం
మాటని మాత్రమే తప్పిన వాడివి కాదు

నిన్ను నమ్ముకున్న దాన్ని
నమ్మకద్రోహం చేసి
చంపిన హంతకుడివి
బతికుండగానే తనకి సమాధి
కట్టిన ఓ గోరికాపరివి.

అందుకే మాట మీద నిలబడే దమ్ము ఉంటేనే,
చెతిలో చెయ్యేసి చెప్ప లేదా
అసలు మాటే ఇవ్వకు.!!



దియా విఘ్నేష్

# ఆటో రంగంలో భారత్‌కు బిగ్ బూస్ట్.. చైనాకు షాక్

భారత్-అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశీయ ఆటోమొబైల్ రంగానికి భారీ ఊతం ఇవ్వనుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఆటో భాగాలపై అమెరికా విధిస్తున్న సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల భారత కంపెనీలకు ఎగుమతుల్లో పెద్ద అవకాశాలు కలగనున్నాయి. ఇదే సమయంలో చైనా ఆటో ఉత్పత్తులపై ఉన్న అధిక సుంకాల కారణంగా ఆ దేశానికి పోటీ ఒత్తిడి పెరిగే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఒప్పందం ప్రకారం భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే కొన్ని ఆటో భాగాలపై ఉన్న 50 శాతం వరకు సుంకాన్ని 18 శాతానికి తగ్గించారు. కొన్ని ఉత్పత్తులకు డ్యూటీ మినహాయింపు కూడా కల్పించారు. దీంతో భారత ఆటో భాగాల ధరలు అమెరికా మార్కెట్లో పోటీగా మారనున్నాయి. తయారీ వ్యయం తక్కువగా ఉండటం భారత కంపెనీలకు అదనపు ప్రయోజనంగా మారనుంది. ఇదే సమయంలో భారత్ కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. 800 సిసి నుంచి 1600 సిసి వరకు ఉన్న అమెరికన్ బైకులపై ఇంపోర్ట్ డ్యూటీని పూర్తిగా రద్దు చేసింది. అలాగే 3000 సిసి ఇంజిన్ కలిగిన అమెరికన్ కార్లపై ప్రస్తుతం ఉన్న 110 శాతం కస్టమ్స్ డ్యూటీని వచ్చే 10 సంవత్సరాల్లో 30 శాతానికి తగ్గించేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయాలతో భారత మార్కెట్లో ప్రీమియం అమెరికన్ వాహనాల ప్రవేశం పెరగనున్నట్లు అంచనా. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో చైనా ఆటో ఉత్పత్తులపై సుమారు 40 శాతం వరకు సుంకాలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో భారత ఉత్పత్తులపై సుంకం తగ్గడం వల్ల ధరల పరంగా భారత కంపెనీలు ముందంజలో నిలిచే అవకాశం ఉంది. దీంతో అమెరికా మార్కెట్లో చైనా కంపెనీలతో పోలిస్తే భారత కంపెనీలకు పోటీలో ఆధిక్యం దక్కే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ఒప్పందం వల్ల భారత్‌కు చెందిన ఆటో మరియు ఆటో భాగాల కంపెనీలకు ఎగుమతులు పెరగడం, లాభాల మార్జిన్ మెరుగుపడడం, అంతర్జాతీయ మార్కెట్లో స్థానం బలపడడం వంటి ప్రయోజనాలు కలగనున్నాయి. భారత్ ఫోర్జ్, సోనా బీఎల్లబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్, రామ్‌కృష్ణ ఫోర్జింగ్స్, బాలకృష్ణ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు ఈ మార్పులతో లాభపడే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే హార్లే డేవిడ్సన్ భాగస్వామ్యంతో హీరో మోటోకార్ప్ ప్రీమియం బైక్ విభాగంలో మరింత బలపడే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in